కొలువుల పండగ.. ఆనందం నిండగా!



హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు నియామక పత్రాలను అందజేశారు. దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన చెన్నప్ప నియామక పత్రం అందుకుంటున్న దృశ్యమిది. - ఈనాడు, హైదరాబాద్

మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మాతాశిశు మరణాలు, సంరక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన మాతాశిశు మరణాలు ఎన్ని జరిగాయి అందుకు కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీపనగండ్ల, మరికొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువ శాతం సీ సెక్షన్ ద్వారా ప్రసవాలు ఎందుకు జరుగుతున్నాయని వైద్యులను ప్రశ్నించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, గైనకాలజిస్టు హెచ్‌వోడీ కిరణ్మయి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం పుస్తక ఆవిష్కరణ

వనపర్తిన్యూటౌన్ : తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2024 పుస్తకాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, జిల్లా ప్రణాళిక అధికారి భూపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో యాదయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సొంత రెవెన్యూనే లక్ష్యం!

- రైతులను పట్టిపీడిస్తున్న అధికారులు
- స్థిరాస్తి వ్యాపారుల కబ్జాలు, అక్రమాలకు అండ

జడ్చర్లలో భూ వ్యవహారం సీసీఎల్‌ఏకు వెళ్లింది. ఓ సర్వే నంబరులోని 16 ఎకరాల 32 గుంటల స్థలంలో 2 ఎకరాల 10 గుంటల భూదాన్ భూమి ఉంది. దీనికి ఓఆర్‌సీ ఇచ్చారని, ఇందులో జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ కోరినా సరిగ్గా స్పందించకపోవటంతో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ గత నెలలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు.

తాజాగా కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుపైనా వేటు పడింది. ధరణిలో పాసు పుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తొలగించారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇనామ్, ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీ, ఓఆర్‌సీలు ఇచ్చారని, డబ్బులు ఇవ్వకపోతే ఏ పని చేయరని ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి ఆర్డీవోను భూసంబంధ వ్యవహారంలోనే సస్పెండ్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్

కొల్లాపూర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీలార్ కొద్ది రోజుల వ్యవధిలోనే సస్పెండ్ కావటం ఉమ్మడి జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఏడాది గోపాల్‌పేట, గుండుమల్ తహసీల్దార్లు, కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలాంటి వాళ్లు ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది ఉన్నారు. పాలమూరు వ్యాప్తంగా అసైన్డ్, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు నేతలు కలిసి రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఎన్‌వోసీలు తీసుకుంటున్నారు. వీరికి సాంకేతికంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొందరు రెవెన్యూ అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.



మహబూబ్‌నగర్ : ప్రజావాణిలో కలెక్టర్‌కు భూ సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

జిల్లాల్లో మచ్చుకు కొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా గతంలో పనిచేసిన ఓ ఆర్డీవో ఏకంగా 50కి పైగా ఓఆర్‌సీలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీని ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య ప్రజాప్రతినిధులు ఆ ఓఆర్‌సీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆర్డీవో ఓఆర్‌సీ ఇచ్చిన 50కి పైగా భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేశారు. అంతర్గత విచారణ సాగుతోంది.
- వనపర్తి జిల్లాలోని ఓ పురపాలికలో దేవాలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓఆర్‌సీ ఇచ్చారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఆ భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరులోని పలు ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీలు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములకు ఇష్టారాజ్యంగా ఓఆర్‌సీ, ఎన్‌వోసీలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజావాణిలో అన్నీ భూసమస్యలే : తమ భూ సమస్యలపై స్పందించటం లేదని, డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయటం లేదని, నెలలు, ఏళ్ల తరబడిగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చేవాళ్లల్లో 70 శాతం మంది భూ సమస్యల వాళ్లే. మండల, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇక్కడిదాకా వస్తున్నారని కలెక్టర్లు కూడా అంగీకరిస్తున్నారు. అయినా పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమవుతున్నారు. ధరణిలో మొత్తం 33 మాడ్యుల్స్ ఉన్నాయి. ఎక్కువగా పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, సర్వే నంబర్ల గల్లంతు, డిజిటల్ సంతకాలు పెండింగ్, భూ విస్తీర్ణం తక్కువగా నమోదు తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వాలి. ఇందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

బోనస్ ప్రకటించినా.. రైతుల అనాసక్తి

పెబ్బేరు, న్యూస్‌టుడే : వసతిగృహాల విద్యార్థులకు, పేదలకిచ్చే రేషన్ బియ్యం స్థానంలో సన్న బియ్యం అందించాలనే దిశగా ప్రభుత్వం యోచిస్తూ ఈ ఏడాది వానాకాలంలో సన్నాల సాగు పెంచాలనే ఉద్దేశంతో సన్న రకాలు పండించిన వరి ధాన్యానికి ఒక క్వింటాలుకు రూ.500 చొప్పున రైతులకు ఇస్తామని ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. బోనస్ అందిస్తామని చెప్పినా.. జిల్లాలో సన్న రకాల సాగు ఆశించిన స్థాయిలో పెరగలేదు. లావు రకం మాత్రం గత ఏడాది కంటే ఎక్కువగానే సాగయ్యింది. సన్న రకాలకు అధిక తెగులు రావడం.. తక్కువగా దిగుబడి వస్తుండటం, పంట కాలం ఎక్కువ రోజులు ఉండటంతో రైతులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. లావు రకాలు గత ఏడాది కంటే ఈసారి 14 వేల ఎకరాలకు పైగా సాగు పెరిగింది.



వీపనగండ్లలో సన్న రకం వరి పైరుకు మందు చల్లుతున్న రైతు

జిల్లాలో సాగు వివరాలు..

జిల్లాలో 2.93 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా.. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో ఏటా వానాకాలంలో రైతులు వరి ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో 1,87,097 ఎకరాలలో వరి సాగు చేపట్టగా.. వీటిలో సన్నరకాలు 1,49,753, లావు రకాలు 37,344 ఎకరాల్లో సాగు చేపట్టారు.

- గత ఏడాది వానాకాలంలో సన్న రకాలు 1,43,067 ఎకరాల్లో సాగవగా.. ఈ సారి 1,49,753 ఎకరాల్లో సాగు నమోదైంది. కేవలం 6,686 ఎకరాల్లో మాత్రమే సాగు పెరిగింది.
- లావు రకాల్లో గతేడాది 23 వేల ఎకరాలు ఉంటే ఈ ఏడాది 37,344 ఎకరాలు సాగైంది. గతేడాది కంటే 14,344 ఎకరాల్లో సాగు పెరిగింది.
- పత్తి 13,032 ఎకరాలు, మొక్కజొన్న 6,885, కంది 5,313, వేరుసెనగ 4,755, జొన్న 1,489, మినుములు 489, వివిధ రకాల పంటలు వందల ఎకరాల్లో సాగయ్యాయి. ఉద్యాన పంటలకు సంబంధించి ఉల్లి, ఎర్ర మిరప, ఆయిల్‌పాం, ఇతర కూరగాయలు కలిపి 5,265 ఎకరాల్లో సాగు నమోదైంది.

దిగుబడి అంచనా ఇలా..

వానాకాలంలో వరిసాగు అంచనాల ప్రకారం జిల్లాలో 4.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా అధికార యంత్రాగం అంచనాలు వేశారు. వీటిలో సన్న రకాలకు సంబంధించి 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, లావు రకాలకు సంబంధించి ఒక లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలున్నాయి. సన్న రకాలను గుర్తించేందుకు ప్రభుత్వం డయల్ మైక్రో మీటర్ పరికరం ఏర్పాటు చేసింది. జిల్లాలో నవంబరు మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. వీటికి సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ, తదితర శాఖల సిబ్బందితో కలెక్టర్ ఆదర్శ్ సురభి సమీక్ష సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఆడపిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. బుధవారం వనపర్తి బాలసదన్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హక్కులు, జీవించే హక్కుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మమ్మతోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని పాల్గొని మాట్లాడారు. అనంతరం బాలికలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యురాలు వనజ, బాలసదన్ పర్యవేక్షకురాలు శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

వనపర్తిన్యూటౌన్, న్యూస్‌టుడే : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే బతుకమ్మ పండగని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా, స్త్రీశిశు సంక్షేమ శాఖకు చెందిన మహిళా సిబ్బంది బతుకమ్మలను సిద్ధం చేసి తీసుకొచ్చారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు నగేశ్, సంచిత్‌గంగ్వార్ పూజ చేశారు. మహిళా సిబ్బంది బతుకమ్మ వద్ద నృత్యాలు చేశారు. వాటిని సిద్ధం చేసిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమాధికారిణి నుషిత, డీడబ్ల్యూవో లక్ష్మమ్మ, పలుశాఖల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ వద్ద ఎస్పీ రావుల గిరిధర్, ఆయన సతీమణి అపర్ణ, పోలీసు సిబ్బంది, కుటుంబసభ్యులు



బతుకమ్మ వద్ద పూజ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

- తెలంగాణ సంస్కృతికి చిహ్నం బతుకమ్మ అని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసు సిబ్బంది కుటుంబసభ్యులతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ కృష్ణకిశోర్, జిల్లాలోని పలువురు ఎస్సైలు, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్తం కొరత రానీయొద్దు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: అత్యవసర సమయాల్లో రక్తం కొరత లేకుండా చూడాలని, అన్ని రకాల గ్రూపుల యూనిట్లను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అత్యవసరంగా రక్తం అవసరమైతే eraktkosh.mohfw.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, ఏరియా ఆసుపత్రుల సమన్వయకర్త డా.చైతన్యగౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు విజేతలు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : డీఎస్సీ పరీక్షల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు వనపర్తి నుంచి 123 మంది అభ్యర్థులు బస్సుల్లో వెళ్లారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులను అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, కలెక్టర్ కార్యాలయ ఏవో భానుప్రకాశ్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల వైభోగం.. ఆది దంపతుల కల్యాణం

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో జోగులాంబ ఆలయం వరకు ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి దంపతులు మంగళ వ్యాయిదాలతో తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన విగ్రహాలను ఆలయం చుట్టూ పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి చేర్చారు. వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మ వార్ల కల్యాణం మూలా నక్షత్ర శుభ గడియలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం అమ్మ వారిని సింహ వాహన సేవలో భాగంగా పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.






కల్యాణంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న అర్చకులు.. కాళరాత్రి అవతారంలో జోగులాంబ

కాళరాత్రిగా జోగులాంబ: జోగులాంబ దేవి భక్తులకు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

స్థైర్యం వీడొద్దు.. ప్రశాంతత చెదరొద్దు!



- మానసిక ఆరోగ్యానికి ఇవే కీలకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు

మానసిక సమస్యలతో బాధపడే వారు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ఎప్పుడూ చిన్నబోయి కనిపించటం, తనలో తానే మాట్లాడుకోవటం, పరధ్యానంలో ఉండటం, కుంగిపోవటం, చిన్నదానికి ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇవ్వన్నీ మానసిక సమస్యలే అయినా అవగాహన లేక అలా భావించటం లేదు. వైద్యం చేయించుకోవటం లేదు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

- న్యూస్‌టుడే, పాలమూరు

ఉదయం నుంచి రాత్రి వరకు తమ పనులను ప్రశాంత వాతావరణంలో చేసుకుపోయే వ్యక్తులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆలోచనలు, ఆకాంక్షలు, జీవితంపై అంచనాలు ఒకరకంగా, చేసే పనులు, వారి పరిస్థితులు మరో రకంగా ఉంటే మానసిక సంఘర్షణకు, ఒత్తిడికి గురవుతారు. తద్వారా వ్యాకులత చెంది వింతగా ప్రవర్తిస్తారు. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు కూడా ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు ఏం చేస్తున్నారో, ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుల ప్రేమ పొందలేనివారు, చదువులో వెనకబడినవారు, ఉద్యోగం రావటం లేదని బాధపడేవారు, అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఉన్నవారు మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటారు. వీరంతా మానసిక వైద్య నిపుణులను సంప్రదిస్తే నయం చేస్తారు. అవగాహన లేక ఉమ్మడి జిల్లాలో చాలా మంది భూతవైద్యులను ఆశ్రయించి జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

రోజూ 150కి పైగా కేసుల రాక : మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఉండటంతో మానసిక వైద్య సేవల విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రులకు కనీసం రోజుకు 150, నెలకు 4,500 మంది వస్తున్నారు. రుగ్మత తీవ్రంగా ఉంటే వైద్యులు ఔషధాలు ఇస్తున్నారు. తీవ్రత తక్కువగా ఉండి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మానసిక రుగ్మతలు చాలా రకాలు.. : ఒకే విషయాన్ని పదే పదేగా ఆలోచించడం, దానిపైనే ధ్యాస కలిగి ఉండటం వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. మానసిక రుగ్మతలు చాలా రకాలుగా ఉన్నాయి. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, ఆత్మన్యూనత, విచిత్రంగా ప్రవర్తించడం, చేసిన పనిని పదే పదే చేస్తుండటం, అతిగా జాగ్రత్తలు తీసుకోవటం, గతంలో జరిగిన చెడు ఘటనలు తరచూ తలచుకుని బాధపడటం, మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు, గంజాయికి బానిస కావటం, తనలో తానే మాట్లాడుకోవటం, ఎవరు పిలిచినా స్పందించకుండా పిచ్చివారిలా ప్రవర్తించడం చేస్తుంటారు. ఆత్మహత్య ప్రయత్నం అనేది కూడా మానసిక రుగ్మతనే.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మానసిక వైద్య నిపుణులు డా.రమాకాంత్


కుటుంబ సభ్యుల సహకారం అవసరం.. : ఉద్యోగ సాధన, ప్రేమ, వ్యాపారం ఇలా ఏదైనా విషయంలో విఫలమైనా, తీవ్ర ఒత్తిడికి లోనయినా, లైంగిక వేధింపులకు గురైనా, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడినా బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా ఇస్తే మందులు అవసరం ఉండదు. కుటుంబ సభ్యుల నుంచే ప్రేమ, ఆదరణ కరవైతే వారు ఏకాకిగా మారుతారు. తీవ్ర ఒత్తిడికి గురవుతారు. అందుకే ఏ సమస్య వచ్చినా చెప్పుకొనేలా, చర్చించేలా ప్రోత్సహించాలి.

ఆల్కహాల్ బానిసలే ఎక్కువ.. : ఉమ్మడి జిల్లాలోని మానసిక రుగ్మతల బాధితుల్లో ఎక్కువ మంది ఆల్కహాల్ బానిసలే. ఆ తర్వాత స్థానంలో ధూమపానం, మాదక ద్రవ్యాలకు బానిసైన వాళ్లు ఉన్నారు. బాధితుల్లో 30 నుంచి 50 ఏళ్ల వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్న చిన్న వాటికి తల్లిదండ్రులు తిడుతున్నారని, కొడుతున్నారని, చదువులో రాణించలేకపోతున్నానని మానసిక ఒత్తిడికి గురవుతున్న టీనేజ్ విద్యార్థులు కూడా ఉంటున్నారు. అన్ని మానసిక సమస్యలకు పరిష్కార మార్గం ఉంది. మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

- డా.రమాకాంత్, మానసిక వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సరిహద్దులు దాటిన దందా

గుట్కా, మట్కా, జూదంతో చిత్తవుతున్న జీవితాలు



సరిహద్దులో కర్ణాటక చెక్‌పోస్ట్ ఇలా..

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

అలవాటు వ్యసనంగా మారితే ఇక అంతే సంగతులు. ఫలితంగా అప్పులు.. అనారోగ్యాలు.. ఆత్మహత్యలు.. హత్యలకు దారితీస్తున్న ఉదాహరణలు ఎన్నో. కుతూహలంతో మొదలెట్టి చెడు అలవాట్లుగా మారి చివరికి వాటికి బానిసలైన వారు కుటుంబాలనే దివాళా తీయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో అడ్డదారుల గుండా గుట్కా, గంజాయి, నల్లబెల్లం, పొగాకు ఉత్పత్తులు ప్రవేశిస్తున్నాయి. గద్వాల, నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు ఇవి చేరుతున్నాయి. రెబన్‌పల్లి, కాన్‌కుర్తి, సజనాపూర్, వాసునగర్, నందిన్నె చెక్‌పోస్టులను దాటుకుని వస్తున్నా అడిగేవారే లేరు.

నిషేధం ఉన్నా... : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెల నుంచి గుట్కాను నిషేధిత జాబితాలో చేర్చినా ఇప్పటికీ వ్యాపారం గుట్టుగా సాగుతోంది. కర్ణాటకలో గుట్కా, పొగాకు ఉత్పత్తులపై నియంత్రణ లేకపోవడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాయచూరు నుంచి వస్తున్న సరకు తెలంగాణ మీదుగా ఏపీకి వెళ్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మక్తల్ పట్టణంలోని సంతబజారులో గుట్కా వ్యాపారి పోలీసులు వచ్చినా ఏం కాదనే ధోరణితో వ్యవహరిస్తున్నారని, అలాంటప్పుడు ఫిర్యాదు చేసి ఉపయోగం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పల్లెలకు పాకిన మట్కా : ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు పెద్ద పట్టణాలకే పరిమిత మైన ఈ క్రీడ పల్లెలకూ పాకడంవిస్తుగొలుపుతోంది. ఏజెంట్లుగా మారిన చాలా మంది యువకులు చరవాణిలలో ప్రత్యేక యాప్‌ల ద్వారా ఈ నెంబర్ గేమ్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించారు. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే రోజూ వందల మంది కొత్తగా ఇందులోకి దిగుతున్నారు.

ఒకప్పుడు ఈ వ్యసన క్రీడను ప్రత్యక్షంగా వెళ్లి ఆడేవారు. అంతా చరవాణిలోనే సాగిస్తున్నారు. మక్తల్ మెయిన్ రోడ్డులో ఓ వ్యక్తి నెలకు రూ.10వేల కిరాయి చెల్లిస్తూ తన దుకాణాన్ని అడ్డాగా మార్చుకొని మట్కాను ప్రోత్సహిస్తున్నారు. నారాయణపేట శివారు కాలనీలో ఒకరు మూడు ఇళ్ల అద్దెకు తీసుకొని పేకాట, మట్కా దందా నడిపిస్తున్నారు.

విస్తరిస్తున్న జూద కేంద్రాలు : పేకాట జూదానికి వేలాది కుటుంబాలు బలైపోతున్నాయి. రాయచూరు క్లబ్‌లలో 24గంటలు ఈ క్రీడకు అనుమతి ఉన్నందున ఈ ప్రాంతం నుంచి మరీ రాయచూరు వెళ్లి దివాళాతీసే వారు ఎందరో కనిపిస్తారు. జిల్లా నుంచి కిరాయి వాహనాలు నేరుగా పేకాట క్లబ్‌ల వద్దకే నడిపిస్తున్నారు.

- మక్తల్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సొంత వాహనంలో మనుషలను తీసుకెళ్లి హైదరాబాద్, షాద్‌నగర్‌లలో ఆడించేవాడు. ఆ తర్వాత రాయచూరుకు మార్చారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పేకాట, మట్కాలకు బానిసై తనకు ఉన్న ఏడెకరాల భూమిని అమ్ముకున్నారు. ఓ వెలుగువెలిగిన వ్యాపారవేత్త పేకాటకు రాయచూరు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు.
- నారాయణపేటలో పేరున్న వ్యాపారి పేకాటతో దివాళా తీసి చివరకు సొంత ఇంటిని తాకట్టుపెట్టారు.
- ఊట్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన జోడెద్దులు అమ్మి వచ్చిన రూ.1.2 లక్షలను జూదం ఆడి పోగొట్టుకున్నారు. కుటుంబ సభ్యులు మందలించగా ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఏం చేయాలి? : కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. కూరగాయల మాటున మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకోవాలి. ఏళ్లకు ఏళ్లు పాతుకుపోయిన చెక్‌పోస్టు ఉద్యోగులను తరచూ బదిలీ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి.

7 యూనిట్లకే విద్యుదుత్పత్తి పరిమితం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి తగ్గడంతో ఎగువ, దిగువ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి ఏడు యూనిట్లకే పరిమితమైంది. ప్రాజెక్టుకు 22 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 22,611 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన మూడు యూనిట్ల ద్వారా 4.018, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 4.554 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 250.024, దిగువన 227.385 మిలియన్ యూనిట్లుగా ఉత్పత్తి నమోదైనట్లు జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.


అసలే పేదరికం.. ఆపై క్యాన్సర్ భూతం


తల్లిదండ్రులతో అనిల్

మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన కొప్పు గొర్రెల కాపరి, అతని భార్య పద్మమ్మ రోజువారీగా కష్టపడుతూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలోకి క్యాన్సర్ భూతం అడుగుపెట్టింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు అనిల్‌కు కణితి ఏర్పడింది. ఇన్నిరోజులూ పోగేసిన డబ్బంతా రక్త క్యాన్సర్ చికిత్సకు నీళ్లలా ఖర్చు చేయాల్సి వచ్చింది. గొర్రెలు విక్రయించి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో కీమోథెరపీ చేయించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చయినా జబ్బు పూర్తిగా నయం కాలేదు. మరో రూ.10లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అంత స్తోమత లేక హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన ఓ ప్రముఖుడు పాఠశాల యాజమాన్యం తరఫున తిరుపతిరెడ్డి దంపతులు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు కుమారై పదో తరగతి వరకు ఉచిత విద్యను అందించడానికి ముందుకు వచ్చారు. దాతలు సహృదయంతో స్పందిస్తే 18ఏళ్ల యువకుడికి నిండు నూరేళ్ల జీవితం ఇచ్చినట్లు అవుతుంది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే

గుండె నిండా బడిగంటలు



సర్కారు కొలువు సాధనకు కలిసి చదివారు.. కల నెరవేర్చుకునేందుకు ఒకరినొకరు ప్రోత్సహించుకున్నారు. ఒక్కో ఇంటిలో ఇద్దరు, ఒక్కో ఊరిలో ముగ్గురు, ఆరుగురు విజేతలుగా అవతరించారు. యువతకు ఆదర్శంగా నిలిచారు. వారి నేపథ్యం, చదువు, పరీక్ష కోసం సిద్ధమైన తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. - న్యూస్‌టుడే బృందం

బావ, బావమరుదులు ఒకేసారి


మోహన్‌నాయక్


తుల్జానాయక్

ధన్వాడ, న్యూస్‌టుడే: మరికల్ మండలం మల్లయ్యతండాకు చెందిన మోహన్‌నాయక్ ధన్వాడ మండలంలోని మందిపల్లి కొత్త తండాకు చెందిన తుల్జానాయక్ అక్కను వివాహమాడారు. మోహన్ నాయక్, తుల్జానాయక్ ఇద్దరూ డీఎస్సీలో ఎంపికై ఎస్జీటీలుగా నియమితులయ్యారు. ఒకే సారి బావ బావమరుదులు కొలువులు రావడంపై రెండు కుటుంబాలతో పాటు ఆయా తండాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

రెండు నెలల్లో రెండు..


జి.గోవర్ధన్

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌కు వరుసగా రెండు కొలువులు దక్కాయి. రెండు నెలల క్రితం ఈయనకు టీజీ గురుకులంలో ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చింది. ఇందులో ప్రవేశం పొందిన ఈయనకు ఇపుడు స్కూల్ అసిస్టెంట్(గణితం) ఉద్యోగం వచ్చింది. జిల్లాస్థాయిలో గణితంలో మూడో ర్యాంకు సాధించిన ఈయన గురుకులం ఉద్యోగం వదిలి స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన ఉద్యోగాలు రాక ముందు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వ్యవసాయంలో తండ్రికి సహాయపడుతూ వచ్చారు. గణితమంటే చాలా ఇష్టమని, అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా అవకాశం రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

అన్నదమ్ములు సాధించారు


నియామక పత్రాలతో సోదరులు వెంకటేశ్, శ్రీనివాస్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న అన్నదమ్ముల లక్ష్యం నెరవేరింది. అందులో ఒకరు మూడు కొలువులు సాధించి ఔరా అనిపించారు. కోస్గి మండలం పీసీ తండాకు చెందిన ఎస్.నార్యానాయక్, కిష్టమ్మ దంపతుల కుమారులు ఎస్.వెంకటేశ్, ఎస్.శ్రీనివాస్‌నాయక్‌లు 2024 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఎస్జీటీ జనరల్ కేటగిరిలో తమ్ముడు ఎస్.శ్రీనివాస్ నాయక్ 19వ ర్యాంకు, అన్న ఎస్.వెంకటేశ్‌కు 11వ ర్యాంకు వచ్చింది. ఎస్.శ్రీనివాస్ ప్రస్తుతం విశాఖపట్నంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీఆర్‌టీ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా ఇటీవల గ్రూప్-4 పోటీపరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగం సాధించారు. ఎస్జీటీగా కొనసాగుతామని వారు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరు ఒకేసారి ఉపాధ్యాయులుగా నియమితులు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

ఒకే తండాలో ముగ్గురికి..


మీనాక్షి | తరుణ్ | జగన్నాథ్

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధి పెద్దతండాకు చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదివి సత్తాచాటారు. జిల్లాలో ఎస్టీ విభాగంలో 12 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఒకే పెద్దతండాకు చెందిన మీనాక్షి, తరుణ్, జగన్నాథ్‌లు ఎంపిక కావడం విశేషం. మీనాక్షి, జగన్నాథ్‌లు గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి విఫలమైనా అధైర్యపడకుండా ఎస్జీటీలో సత్తాచాటారు.

రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి



బంగారు పతకంతో రితిక్ అభిమన్యురెడ్డి (మధ్యలో)

ధరూరు, న్యూస్‌టుడే: మిర్యాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్యురెడ్డి రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కారణంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరులో మైసూరులో 11 ఏళ్లలోపు విభాగం రోలర్‌స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఉత్తమ క్రీడను ఎంపిక చేసుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావటంపై గ్రామస్థులు అభినందించారు.

వరి కంకులను తలపిస్తున్న మంచు బిందువులు



మంచు కురిసె.. కంకుల్లా మెరిసె!


వరి పైరుపై మెరుస్తున్న మంచు బిందువులు

వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. తెల్లవారు జామున మంచు కురుస్తోంది. మంచు కరిగి వరి పైరు కొనలపై నీటి బిందువులు సూర్య కిరణాలకు మెరుస్తూ కంకులను తలపిస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతంలో ఈ చిత్రాలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి. - న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం

మూడు ఉద్యోగాలతో జయకేతనం


తల్లిదండ్రులతో రాజేశ్వరి ఎడమ నుంచి రెండో వ్యక్తి

ఊట్కూరు, న్యూస్‌టుడే: నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన జయశ్రీ, కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలో చిన్న టీకొట్టు నడుపుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కష్టపడి చదివి 2017 డీఎస్సీకి హాజరుకాగా 0.6 మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రుల కష్టం మనసులో ఉంచుకుని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఆంగ్లం, సాంఘికశాస్త్రం ఉద్యోగాలు సాధించారు. మూడు నెలల క్రితం మక్తల్ జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం ఎస్జీటీగా అవకాశం వచ్చినా తరువాత ర్యాంకు వారికి అవకాశం వస్తుందనే భావనతో వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ ఉద్యోగం సాధించటమే లక్ష్యమని చెబుతున్నారు.

ఔరా! ఐదు కొలువులు


వెంకట్రామి రెడ్డి, గుండుమాల్

కోస్గి, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే మాటలా? కానీ చేసి చూపించారు గుండుమాల్‌కు చెందిన బాయికాడి వెంకట్రామిరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి, తల్లి యశోద వ్యవసాయం చేసుకుంటూ ఆయనను చదివించారు. 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, చేయడం ఇష్టం లేక వెళ్లలేదు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2017లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భక్తిమళ్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో సాంఘికశాస్త్రంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, తెలుగులో ఎనిమిదో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు.. మరో పరీక్షలో రాష్ట్రస్థాయి 164వ ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమాధికారిగా ఎంపికయ్యారు. . తాను ఉపాధ్యాయుడిగానే కొనసాగి పేద విద్యార్థులకు సహాయపడతానని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

యాభైలో పడినా...


అశ్విని నర్సింలు

ధన్వాడ : ధన్వాడ పట్టణానికి చెందిన అశ్విని నర్సింలు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన తెలుగు పండిట్ కోర్సు చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే, ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ, కులవృత్తి చేస్తూ ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వయసు 50లో పడినా ఇదే చివరి అవకాశం కావడంతో అహర్నిశలు కష్టపడ్డారు.

సహకారంతో గెలిచారు..


చెన్నప్ప, సజనాపూర్

దామరగిద్ద : సజనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, హన్మంతు దంపతులకు అయిదుగురు సంతానంలో మూడోవారు చెన్నప్ప. ఈ కుటుంబం వ్యవసాయం, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని స్థితిలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెన్నప్ప చదువును కొనసాగించారు. ఇటీవల డీఎస్సీలో జిల్లాలో 13వ ర్యాంకుతో ఉపాధ్యాయ నియామక పత్రాన్ని సీఎం చేతులమీదుగా అందుకున్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెన్నప్ప చెప్పారు.

భర్త ప్రోత్సాహంతో మూడు..


మమత

వనపర్తి పట్టణం : కొత్తకోటకి చెందిన మమత మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త రాఘవరెడ్డి ప్రోత్సాహంతో వీటిని సాధించానని ఆమె తెలిపారు. టీజీటీ గణితం ఉద్యోగానికి ఎంపికై వెల్టూరు బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియాయక పత్రం అందుకున్నారు. హాస్టల్ వార్డెన్‌గా ఎంపికైనప్పటికీ ధ్రువపత్రాల పరిశీలన కాలేదు.

ఊట్కూరు.. ఆరుగురు


కె.అశోక్, మాలతి లత

ఊట్కూరు : ఊట్కూరు నుంచి ఏకంగా ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సర్దార్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.ప్రదీప్ తెలుగు పండింట్‌గా, శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కె.అశోక్ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా నియామకపత్రాలు అందుకున్నారు. మాలతి లత జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా, కార్గిల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు మహేశ్, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన భారతి ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు. టి.మోనప్ప(పాతపేట) హిందీ పండిట్‌గా ఎంపికయ్యారు. వీరంతా ఊట్కూరు పేరును మార్మోగించారు.

పీజీ వైద్య సీట్లకు కసరత్తు

ఎముకలు, ఈఎన్‌టీ, మత్తుమందు, నేత్ర విభాగాల్లో దరఖాస్తు


పీజీ సీట్లపై చర్చిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, సహాయ ఆచార్యులు డా.కిరణ్‌ప్రకాశ్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీజీ సీట్ల కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2016లో కళాశాల ప్రారంభమైంది. ఐదేళ్ల తర్వాత నుంచి పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నుంచి దరఖాస్తు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతి ఇచ్చినా ఆయా వైద్య విభాగాలకు తగినంత ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేకపోవడంతోనే సీట్లు మంజూరు కావటం లేదు. కొత్తగా దరఖాస్తు చేస్తున్న వైద్య విభాగాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రస్తుతం ఉన్నవి 29 మాత్రమే : మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. క్లినికల్‌లో ప్రసూతి విభాగానికి రెండేళ్ల క్రితం అనుమతి రాగా ఆరు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది పిడియాట్రిక్(చిన్నపిల్లలు), అప్తమాలజీ(కన్ను), అనస్థీషియా(మత్తుమందు) తదితర విభాగాల్లో పీజీ సీట్లకు దరఖాస్తు చేయగా ఎన్‌ఎంసీ పిడియాట్రిక్‌కే అనుమతి ఇచ్చింది. ఈ విభాగంలో మంజూరయ్యే నాలుగు పీజీ సీట్లల్లో వచ్చే నెలలో వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. తగినంత మంది ఆచార్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో అప్తమాలజీ, అనస్థీషియా విభాగాలకు అనుమతి రాలేదు. నెల క్రితం జరిగిన బదిలీల్లో కళాశాలకు అనస్థీషియా, అప్తమాలజీ ఆచార్యులు రావటంతో ఆయా విభాగాల్లో పీజీ సీట్ల కోసం మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వీటికి కూడా అనుమతి లభిస్తే అదనంగా నాలుగు చొప్పున 8 పీజీ సీట్లు మంజూరవుతాయి. 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), ఈఎన్‌టీ (గొంతు, ముక్కు, చెవి) కోర్సుల్లో నాలుగు చొప్పున సీట్ల కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయడానికి కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫీజుగా ఒక్కో విభాగానికి రూ.5.90 లక్షల చొప్పున మొత్తం రూ.11.80 లక్షలు ఎన్‌ఎంసీకి చెల్లిస్తున్నారు. సిబ్బంది కూడా ఉండటంతో వీటికి పీజీ సీట్లు వస్తాయని నమ్ముతున్నారు.

ముఖ్య విభాగాలకే మొండిచేయి.. : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా రోగులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్య సేవల కోసమే వస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో పీజీ సీట్లు చాలా అవసరం. జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు రావడానికి ఒక ఆచార్యుడు, ఏడుగురు అసోసియేట్ ఆచార్యులు, 15 మంది సహాయ ఆచార్యులు, 220 పడకలు, ఏడు యూనిట్లు ఉండాలి. పడకలు, యూనిట్లు ఉన్నా.. ఒక ఆచార్యురాలు, నలుగురు అసోసియేట్ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు మాత్రమే ఉండటంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడం లేదు. జనరల్ సర్జరీ విభాగంలో ఆచార్య పోస్టు ఖాళీగా ఉంది. ఒక అసోసియేట్ ఆచార్యుడు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉన్నారు. ఫలితంగా పీజీ సీట్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ట్రాలీ ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరి మృతి


క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

పెబ్బేరు పట్టణం, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి పెళ్లి సంబంధం కుదుర్చుకుని వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి, స్వల్ప గాయాలైన వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో బోయ ముద్దు చిన్నరాముడు(60), బోయ మునెన్న(70) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో చెనుగోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం/ రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి


మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర సేవికా సమితి కార్యకర్తల పథసంచలనం



మాట్లాడుతున్న ఉమాదేవి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శక్తికి ప్రతిరూపం మహిళ అని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసంలో వారంరోజుల పాటు ప్రారంభిక శిక్షా వర్గను నిర్వహించి చివరిరోజు బుధవారం పట్టణంలో పథసంచలనం నిర్వహించారు. మాడల్ బేసిక్ పాఠశాల నుంచి ర్యాలీగా ప్రారంభమై బాలగంగాధర్‌తిలక్ చౌరస్తా, గడియారం, మార్కెట్ రోడ్, పాతబస్టాండ్, పాన్‌చౌరస్తా, రాంమందిర్‌చౌరస్తా, రాంనగర్, వన్‌టౌన్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ముఖ్య వక్తగా ఉమాదేవి మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళా అని అభివర్ణించారు. తమ కుటుంబాన్ని ఏవిధంగా సక్కదిద్దుకుంటుందో ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కూడా ప్రతి మహిళ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షురాలు డా.కె.పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయిలా మనోధైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వయం సేవికా సమితి విభాగ్ కార్యావాహిక దేదీప్యశ్రీ, పాలమూరు జిల్లా కార్యావాహిక నాగిళ్ల అరుణ, రాష్ట్ర స్వయం సేవికలు లక్ష్మీ, వసంతం పద్మావతి, ఉమా, సులోచన, రాజేశ్వరితో పాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో సఫారీ


సోమశిల అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్దకు సఫారీ వాహనంలో వచ్చిన పర్యాటకులు

కొల్లాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో విహరించడానికి సఫారీ వాహనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహనంలో ఒకేసారి 8 మంది ప్రయాణించవచ్చని, ఒకరికి రూ.200 టికెట్‌గా నిర్ధారించినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమశిల తీరంలోని పుష్కరఘాట్ల దగ్గర, కొల్లాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్కు వద్ద సఫారీ వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. సోమశిల ఏకో పార్కు, అటవీప్రాంతం లోపల వాచ్‌టవర్, ఎర్రకుంట తీరప్రాంతం అందాలు చూపించి తర్వాత యథాస్థానంలో దింపుతారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

వివాహిత అనుమానాస్పద మృతి


శాంతమ్మ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బావిలో పడి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. గోపాల్‌పేట మండల ధర్మతండాకు చెందిన శాంతమ్మ (40) మంగళవారం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆమె కుమార్తె వసంత సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఎక్కడున్నావని.. ఎప్పుడు వస్తావని అడిగారు. ఎనుకుంట వద్ద ఉన్నానని త్వరలో ఇంటికి వస్తానని శాంతమ్మ బదులిచ్చారు. ఆమె ఫోన్ 7.30 గంటలకు స్విచ్ఛాఫ్ అయ్యింది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి స్టార్టర్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టార్టరు కోసం వెతుకుతుండగా బావి గడ్డపై చెప్పులు, చున్నీ, బావిలో చీర ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి శాంతమ్మ భర్త బద్రు, కుమారుడు గణేశ్, కుమార్తె వచ్చి చీర, చెప్పులను చూసి గుర్తు పట్టారు. ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్సై జలేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ బృందం వెంట వచ్చిన శునకం చెన్నూరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఆగింది. వివాహిత మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బావిలో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బి.ప్రభాకర్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించిందని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మదనాపురం : 8074538150 | వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 | వీపనగండ్ల : 9121229043

ప్రశ్న: అయ్యవారిపల్లి బీసీ కాలనీలో కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీళ్లు నిలిచి దోమలు ప్రబలుతున్నాయి. అధికారులు మరమ్మతులు చేపట్టాలి. **- మంచాలకట్ట బాలపీరు, అయ్యవారిపల్లి**

సమాధానం: త్వరలోనే మరమ్మతులు చేయించి లీకేజీని అరికడతాం. **- రాజేశ్, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, చిన్నంబావి

తెరపై ఈనాడు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: శ్రీనివాస: **దేవర** వెంకటేశ్వర: **రామ్‌నగర్‌బన్నీ**, శ్రీరామా: **వెట్టాయం**

ప్రాణవాయువు సమస్య పరిష్కారం



ప్రారంభానికి సిద్ధంగా ద్రవ ఆక్సిజన్ ప్లాంట్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు ఆక్సిజన్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో సిలిండర్లు ఉండటం వల్ల రోగికి చికిత్స అందుతున్న సమయంలో ప్రాణవాయువు అయిపోతే కొత్త సిలిండర్ వచ్చే వరకు ఆగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అలాంటి సమస్యకు అడ్డుకట్ట వేస్తూ ద్రవ ఆక్సిజన్ ప్లాంటును వైద్యులు, కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవతో దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి కట్టించారు. పదివేల లీటర్ల సామర్థ్యం గల ప్లాంటును ఏర్పాటు చేశారు. ప్రతి వార్డుకు ఆక్సిజన్ సరఫరా అయ్యేలా పైపులైన్ ఏర్పాటు చేశారు. ప్రాణవాయువు అయిపోయే కొద్ది ఏజెన్సీ వారు వచ్చి నింపుతారు. ఒక్కసారి నింపడానికి దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ప్లాంటు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధగా ఉంది. ఆసుపత్రిలో ఉన్న 150 పడకలకు ప్రాణవాయువు సరఫరా చేసుకునే వీలుంది.

సిలిండర్ల మార్పిడి ఉండదు..

గతంలో ఆపరేషన్ థియేటర్లకు, అత్యవసర వార్డులకు, ఆస్తమా రోగులకు ప్రాణవాయువు సిలిండర్ల ద్వారా అందించేవారు. ఈ క్రమంలో సిలిండర్ అయిపోతే వెంటనే మరో సిలిండర్ తీసుకువచ్చి అమర్చాల్సి ఉండేది. ప్రస్తుతం అలాంటి అవసరం లేకుండా నేరుగా రోగికి కావాల్సినంత ఆక్సిజన్ అందించవచ్చు. రోగికి సకాలంలో సరైన చికిత్స అందించి ప్రాణాలు రక్షించవచ్చు.

టెక్నీషియన్లకు శిక్షణ..

ద్రవ ఆక్సిజన్ సరఫరా చేసేందుకు వైద్య కళాశాల ఆధ్వర్యంలో నలుగురు ప్రత్యేక టెక్నీషియన్లు శిక్షణ పొందుతున్నారు. వారు ప్రతి వార్డుకు సరిగా అందుతుందా? లేదా? రోగికి కావాల్సిన మోతాదులో ప్రాణవాయు అందిస్తూ పర్యవేక్షణ చేస్తారు. లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేస్తారు.

కలెక్టర్ నిధులతో ఏర్పాటు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ద్రవ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ప్రతిపాదన పెట్టాం. వెంటనే ఆయన స్పందించారు. ప్లాంటు ఒకసారి నింపితే వినియోగాన్ని బట్టి రెండు నుంచి మూడు నెలల వరకు వినియోగించవచ్చు. కేంద్రం ప్రారంభం కానప్పటికీ కలెక్టర్ అనుమతితో ప్రస్తుతం ద్రవ ఆక్సిజన్ అందిస్తున్నాం.

- రంగారావు, పర్యవేక్షకుడు, జనరల్ ఆసుపత్రి

ఉద్యోగానందం


యాస్మీన్‌బేగం

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన రైతు నజీర్ కుమార్తె యాస్మీన్‌బేగం బుధవారం స్కూల్ అసిస్టెంట్ (సాంఘిక శాస్త్రం) ఉపాధ్యాయురాలిగా నియామక పత్రం అందుకున్నారు. నజీర్ వ్యవసాయం చేస్తూ ఆత్మకూరులో ఓ నూనె విక్రయాల దుకాణంలో అటెండర్‌గా పనిచేస్తారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇటీవల విడుదలై డీఎస్సీ ఫలితాల్లో కుమార్తె యాస్మీన్ ఉద్యోగం సాధించారు. రోజూ దినపత్రికలు చదివడం, కావాల్సిన పుస్తకాలను ఆన్‌లైన్ ద్వార తెప్పించుకుని డీఎస్సీకి సిద్ధమైనట్లు ఆమె తెలిపారు. రోజు ఇంటి వద్ద 12 నుంచి 15 గంటలు కష్టపడి చదివినట్లు పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉందని తెలిపారు.


కల్పన

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : మండలంలోని తాటిపాములకు చెందిన కల్పన భర్త ప్రోత్సాహంతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. చిన్న కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఈమె. . ఇద్దరు అక్కలు ఉపాధ్యాయినులు విధులు నిర్వహిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని చదివి రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించానని కల్పన తెలిపారు.


రాధ

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: వీపనగండ్లకు చెందిన గుజ్జుల రాధ రెండు నెలల కిందట విడుదలైన గురుకుల ఫలితాల్లో టీజీటీగా ఎంపికయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు గురుకుల పాఠశాలలో పని చేస్తుండగా, ఇటీవల విడుదల అయిన డీఎస్సీ ఫలితాల్లో హిందీ పండిట్‌గా ఉద్యోగం సాధించి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. హిందీ పండిట్‌గానే కొనసాగుతానని ఆమె తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని ఎర్రగట్టు సమీపంలో మైసమ్మ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం హోమాలు, కలశ పూజలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా సభ్యత్వ నమోదు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని భాజపా రాష్ట్ర నాయకులు వేముల నరేందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ సభ్యత్వ నమోదు సమీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటికే 15 వేల సభ్యత్వ నమోదు పూర్తి కావచ్చిందన్నారు. నియోజకవర్గ సభ్యత్వ సమన్వయకర్త మున్నూరు రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, నాయకులు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, శ్రీశైలం, పెద్దిరాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు, న్యూస్‌టుడే: మండలంలోని అయ్యవారిపల్లిలో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ మండల అధ్యక్షుడు వినోద్ సాగర్, బీజేవైఎం మండల కన్వీనర్ ప్రశాంత్ సాగర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

జాతీయ సాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


దివ్య

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని మానాజీపేట గ్రామానికి చెందిన విద్యార్థిని దివ్య ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నవంబరులో బీహార్‌లో జరిగే పాల్గొంటుందని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : డీకే అరుణ


కొత్తకోటలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆరుగ్యారంటీల అమలు ఉత్తిమాటగానే మిగిలి పోయిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. భాజపా సభ్యత్వ నమోదు సందర్భంగా బుధవారం కొత్తకోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హరియాణాలో ఇదే గ్యారంటీలను కాంగ్రెస్ ప్రకటించినా అక్కడి ప్రజలు ఆపార్టీని విశ్వసించకుండా భాజపాకే మూడోసారి పట్టం కట్టారని తెలిపారు. భాజపాలో వంద మంది సభ్యులను చేర్పిన వారికి క్రియాశీల కార్యకర్తగా గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. పలువురు మహిళలతో ఉన్న చరవాణులను ఎంపీ తీసుకుని సభ్యత్వం చేసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని, కనీసం రోడ్డు అయినా వేయించాలని మహిళలు కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, వనపర్తి భాజపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర బాధ్యుడు సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యత్వ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణ పేరుతో కుంభకోణం

మదనాపురం, న్యూస్‌టుడే : రైతులకు పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. బుధవారం మదనాపురంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూసీనది సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరో కుంభకోణానికి పాల్పడుతోందని ఆరోపించారు. అనంతరం ఆమె డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో భాజపా మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, రాజశేఖర్ యాదవ్, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్, నితిన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం : వాకిటి


మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఎన్నికల హామీ మేరకు రూ.రెండు లక్షల పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం బాలకిష్టాపూర్ గ్రామంతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, గృహ లక్ష్మి రాయితీ ధ్రువపత్రాల పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 4,174 మంది అన్నదాతలకు రూ.36.50 కోట్లు పంట రుణం మాఫీ వర్తించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరుపై అపోహలు సృష్టించే ప్రయత్నాలను కార్యకర్తలు ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్ పాష, ఎంపీడీవో సుజాత, కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ నాగరాజుగౌడ్, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, పుర అధ్యక్షురాలు గాయత్రి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు స్వాధీనపర్చండి..

ఆత్మకూరు : ఆత్మకూరులో ఇళ్ల స్థలాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన లబ్ధిదారులకు స్థలాలు స్వాధీనపరచాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం ఇచ్చారు. 2008లో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ఇప్పటికీ స్థలాలు అప్పగించకపోవడం వల్ల లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని ఆపార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్ వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సి.రాజు, నాయకులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ గొప్ప సామాజిక సంస్కర్త, రాజకీయనాయకుడని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎల్లస్వామి అన్నారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా శ్రీరంగాపురంలోని బీఎస్పీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, బీసన్న, భాస్కర్, మౌళీ, మహిళలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై దృష్టి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: యువత మేధాశక్తి పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తిలో మైత్రి క్రికెటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్సై జయన్న, ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరుకు చెందిన వగ్గు విజయప్రకాశ్, కొండా సత్యనారాయణ, మేడేపల్లి శ్రీరాములు అనే ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం దక్కిందని సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వగ్గు రాఘవేందర్, విజయ్ తెలిపారు. విజయప్రకాష్, సత్యనారాయణలను అసోసియేట్ అధ్యక్షులుగా, శ్రీరాములును రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాలు జారీ చేశారని వారు పేర్కొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సద్దాల శ్రీనివాసులును పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి లేఖ ఇచ్చారని మండల శాఖ అధ్యక్షుడు ఎం.రాజు, కార్యదర్శి వెంకటన్న తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, శారీరక దృఢత్వం కలుగుతుందని తహసీల్దార్ మురళీగౌడ్, ఎస్సై రామకృష్ణ అన్నారు. దసరా పండగ సందర్భంగా శ్రీరంగాపురంలో హన్‌మాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరంగాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాములు యాదవ్, శ్రీహరిరాజు, సయ్యద్ నుస్రత్‌పాషా, ఎల్లస్వామి, శ్రీనివాసులు, రమేశ్, రామచంద్రయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని భాజపా జిల్లా నాయకులు అనుజ్ఞారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాంపల్లి గ్రామ శివారులో భాజపా మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుష్మాస్వరాజ్ స్మారక మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో భాజపా జిల్లా పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ విక్రమ్, సీనియర్ నాయకులు టి.భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

పాన్‌గల్, న్యూస్‌టుడే : చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాల వేయిస్తే ఆరోగ్యంగా ఉంటారని పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పాన్‌గల్ ఆరోగ్య ఉపకేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రణాళిక ప్రకారం టీకా వేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి తారశశాంక, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.







వనపర్తి గాంధీనగర్‌లో.. శ్వేతనగర్ కాలనీలో... వల్లభ్‌నగర్‌లో.. అమరచింత కాళికాలయంలో.. పెబ్బేరు కన్యకా పరమేశ్వరీ ఆలయంలో.. చిన్న చౌడేశ్వరీ ఆలయంలో

వీణాపాణి.. వేద వాణి

న్యూస్‌టుడే బృందం : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమాత సరస్వతీ దేవిగా పూజందుకుంది. విద్యాబుద్ధులను ప్రసాదించే తల్లికావడంతో.. చిన్నారులు, విద్యార్థులచే పూజలు జరిపించారు. కొందరు పలకలు, బలపాలు, పెన్నులు చిన్నారులకు అందించారు. మనసారా స్తుతిస్తే భక్తుల అజ్ఞాన తిమిరాలను తొలగించి, వారి హృదయాల్లో జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేస్తుందని అమ్మవారి విశిష్టతను అర్చకులు తెలిపారు. ఆవరణలో బతుకమ్మ ఆటలతో భక్తులు ఆనందంగా గడిపారు.


తాటిపాములలో


ఆత్మకూరు వాల్మీకీనగర్‌లో








కానాయపల్లి కోటిలింగేశ్వర ఆలయంలో.. కొత్తకోటలో భవానీ శంకర ఆలయంలో.. మదనాపురం అజ్జకొల్లులో.. ఆత్మకూరులో.. ఆత్మకూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు.. గోపాల్‌పేటలో.. ఖిల్లాగణపురంలో

దారిని కప్పేసిన పిచ్చి మొక్కలు



అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక సమీపంలో జోగిని కాలనీ ఏర్పడి 30 ఏళ్లు అవుతోంది. కాలనీ వాసులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేవు. అమరచింత - మరికల్ ప్రధాన బీటీ రహదారి ఎడమ వైపు మురుగు కాలువ నిర్మించారు. కాలువ నిర్మాణ సమయంలో వీధిలోకి వెళ్లేందుకు కల్వర్టు ఎత్తుగా నిర్మించారు. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వీధి రహదారిపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పుర కమిషనర్ నూరుల్ నజీబ్‌ను వివరణ కోరగా పారిశుద్ధ్య పనులు చేయిస్తామని, అంతర్గత వీధి రహదారిని సీసీగా మార్చి కల్వర్టును సమానంగా చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

భూ వివాదంలో మాజీ సర్పంచిపై దాడి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : భూ వివాదంలో మండలంలోని మానాజీపేట మాజీ సర్పంచి సతీశ్‌కుమార్‌పై కొందరు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వ్యవసాయ భూమి ఖరీదు చేసిన ఆయనను దాయాదులైన తమకు తెలియకుండా భూమి ఎలా కొనుగోలు చేశావంటూ మానాజీపేట గ్రామానికి చెందిన రాజనాల ఆంజనేయులు, రాజనాల బాలరాజులు రెండు రోజుల క్రితం గ్రామంలోని పెద్దలను ఆశ్రయించారు. పంచాయితీ కొలిక్కికి రాకపోవడంతో ఆ పొలాన్ని వేరుసెనగ పంట సాగు కోసం ఆంజనేయులు, బాలరాజు చదును చేశారు. సతీశ్‌కుమార్ పోలీసులను ఆశ్రయించగా ఎస్సై సురేశ్‌గౌడ్ మంగళవారం గ్రామానికి వెళ్లి ఇరువురిని పిలిచి పొలంలోకి ఎవ్వరు వెళ్లకూడదని హెచ్చరించారు. రాత్రి వేళల్లో పంట సాగు చేస్తారని.. మాజీ సర్పంచి గ్రామానికి చెందిన కొందరితో మంగళవారం రాత్రి పొలం వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న బాలరాజు, ఆంజనేయులు దాడి చేయడంతో సతీశ్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుడి భార్య మందుల స్వరూపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


సూచనలు ఇస్తున్న డీపీవో సురేశ్ కుమార్

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని డీపీవో సురేశ్ కుమార్ సూచించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా వీపనగండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు సరైన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవో లక్ష్మమ్మ, ఎస్సై కె.రాణి, పంచాయతీ కార్యదర్శి దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏదులలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

గోపాల్‌పేట), న్యూస్‌టుడే : ఏదులను మండల కేంద్రంగా ప్రకటించి ఏడాదైనా రెవెన్యూ కార్యాలయాన్నే ఏర్పాటు చేశారని వెంటనే మిగతా ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మండల సాధన సమితి నాయకులు కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. వివరాలు తెలుసుకుని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని కలెక్టరు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అక్కడి నుంచి వెళ్లి ఎస్పీ ఆవుల గిరిధర్‌ను కలిసి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ చెప్పారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మొగిలి మశన్న, దొడ్లరాములు, రమేశ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

చెగువేరాకు నివాళి

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చెగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్ పాల్గొన్నారు.

అమరచింత : పట్టణంలో బుధవారం రాత్రి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు వెంకటేశ్, రసూల్, వెంకి, చంటి, జహంగీర్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జబ్బార్

ఆత్మకూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండీ జబ్బార్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన జిల్లా కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీకి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి యండీ ఖాజ, జిల్లా నాయకులు గయాసుద్దీన్, ముజాహిద్, సిరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాల్లో తిష్ఠ వేసిన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ ఉపాధ్యాయుల, సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో చేపట్టిన బతుకమ్మ కార్యక్రమం అనంతరం అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీ సమస్యల పై ఇన్‌ఛార్జి సీడీపీవో హజీరాబేగానికి వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జ్యోతి, నాయకురాలు రమాదేవి, విజ్జులత, భాగ్యలక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.